VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మార్చి 07 శుక్రవారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 225

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



- ముసాయిదా బిల్లుకు రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం
- ఎస్సీ కులాల వర్గీకరణ బిల్లుకు కూడా గ్రీన్‌సిగ్నల్
- కోర్ అర్బన్ ఏరియాగా ఓఆర్ఆర్ లోపలి ప్రాంతం
- అక్కడి నుంచి ట్రిపుల్ ఆర్‌కి 2 కి.మీ. వరకు ఫ్యూచర్ సిటీ ఏరియా
- మిగిలిన ప్రాంతం అంతా గ్రామీణ తెలంగాణ
- 56 గ్రామాలతో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ ఏరియా ఏర్పాటు
- ఒకే గొడుగు కిందకు ఎస్‌హెచ్‌జీలు..సెర్ప్, మెప్మా విలీనం
- టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి బోర్డు
- తెలంగాణ పర్యాటక పాలసీ%-%2025కు ఆమోదం
- 10,954 రెవెన్యూ గ్రామాలకు మళ్లీ గ్రామ పరిపాలన అధికారులు
- కేబినెట్ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ ఇచ్చిన సవరణ నివేదికను ఆమోదించింది.**

# బీసీలకు 42% కోటా

హైదరాబాద్: ఎస్సీ కులాల వర్గీకరణ ముసాయిదా బిల్లును రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. స్థానిక సంస్థల్లో, విద్యారంగంలో, ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే మరో ముసాయిదా బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సుదీర్ఘంగా సమావేశమైన రాష్ట్ర కేబినెట్ ఈ మేరకు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమావేశానంతరం రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివరాలు విలేకరులకు వెల్లడించారు.

చిక్కులు తలెత్తకుండా ఎస్సీ వర్గీకరణ బిల్లు

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీల వర్గీకరణ చేపట్టడానికి ఏర్పాటు చేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ గత నెల 3న సమర్పించిన తొలి విడత సిఫారసులపై వివిధ వర్గాల నుంచి 71 విజ్ఞప్తులు వచ్చాయని పొంగులేటి తెలిపారు. ఈ విజ్ఞప్తులను పరిష్కరించిన అనంతరం తాజాగా కమిషన్ సమర్పించిన నివేదికను బిల్లు రూపంలో శాసనసభలో ప్రవేశపెట్టాలని మంత్రివర్గం నిర్ణయించిందని చెప్పారు.

ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా బిల్లును రూపొందించామన్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు కొత్త బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో.. 37 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు 2017లో సభలో ప్రవేశపెట్టిన బిల్లును వెనక్కి తీసుకోవాలని నిర్ణయించినట్టు పొన్నం ప్రభాకర్ వివరించారు.

ఇక 3 సెక్టార్లుగా రాష్ట్రం!

'రాష్ట్రాన్ని మూడు సెక్టార్లుగా విభజించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి ప్రాంతాన్ని కోర్ అర్బన్ ఏరియాగా, అక్కడి నుంచి ట్రిపుల్ ఆర్ రోడ్డుకు ఆవల 2 కి.మీల బఫర్ జోన్ వరకు ఫ్యూచర్ సిటీగా, మిగిలిన ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా విభజించాలని నిర్ణయించాం.

రూరల్ తెలంగాణ పరిధిలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు రావు. 7 మండలాల్లోని 56 గ్రామాలతో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ ఏరియా (ఎఫ్‌సీడీఏ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. నాగార్జునసాగర్, శ్రీశైలం హైవేల మధ్య ఉన్న 30 కి.మీల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నాం. హెచ్ఎండీఏ పరిధిలోని 36 గ్రామాలను ఎఫ్‌సీడీఏకి బదిలీ చేశాం. ఫ్యూచర్ సిటీ కోసం 90 పోస్టులను ఆమోదించాం.

హెచ్ఎండీఏ పరిధి విస్తరణ

హెచ్ఎండీఏ పరిధిని రీజినల్ రింగ్ రోడ్డుకు 2 కి.మీల బఫర్ జోన్ వరకు పొడిగించాం. 11 జిల్లాల్లోని 104 మండలాలు, 1,355 గ్రామాలకు హెచ్ఎండీఏ పరిధి విస్తరించింది. కొత్తగా 332 రెవెన్యూ గ్రామాలు హెచ్ఎండీఏ పరిధిలోకి వస్తాయి..' అని పొంగులేటి తెలిపారు.

సెర్ప్, మెప్మా విలీనం

'కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి మిషన్ కింద రూపొందించిన పాలసీ%-%2025ని కేబినెట్ ఆమోదించింది. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు మహిళల ఆర్థికాభివృద్ధికి అందించిన సహకారాన్ని మళ్లీ కొత్త పాలసీతో

పునరుద్ధరిస్తాం

. మహిళా స్వయం సహాయక సంఘాలు ఒకే గొడుగు కింద ఉండాలనే ఉద్దేశంతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లను ఒకే సంస్థగా విలీనం చేయాలని నిర్ణయించాం. ఇందిరా మహిళా శక్తి సంఘాల మహిళల రిటైర్మెంట్ వయస్సును 60 నుంచి 65 ఏళ్లకు పొడిగించడంతో పాటు సభ్యులుగా చేరేందుకు కనీస వయస్సును 18 నుంచి 15 ఏళ్లకు కుదించాం..' అని మంత్రి చెప్పారు.



## అడుగంటుతున్న భూగర్భ జలాలు ఆందోళన చెందుతున్న రైతులు

**పెద్దపల్లి:** రోజురోజుకూ భూగర్భ జలాలు పడిపోతున్నాయి. దీంతో ఒక వైపు బోర్లు ఎత్తిపోతుండగా.. మరో వైపు బావుల్లో నీరు అడుగంటి పోతున్నాయి. దీంతో సాగు కష్టాల్లో, ఆర్థిక నష్టాల్లో రైతులు కూరుకుపోతున్నారు. నిన్న మొన్నటి వరకు పెద్దపల్లి జిల్లాపై కుండగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగమైన అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో చుక్కనీరు లేకపో వడంతో బోర్లు, బావులు అడుగంటుతున్నాయి. దీంతో రైతులు తిరిగి బోర్లు వేసుకోవడం, బావులను పూడిక తీయడం లాంటి పనులను చేపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. తలాపున పారుతున్న గోదావరి నీ సేను నీ సెలుక ఎడారి అని స్థానిక కవి రచయిత మల్లావజ్జల సదాశివుడు మూడు దశాబ్దాల క్రితం తెలంగాణ సాగు నీటి కష్టాలను ఏకరువు పెట్టగా పదేళ్ల తర్వాత తిరిగి అదే పరిస్థితులు నెలకొనడంతో కాంగ్రెస్ పాలన వచ్చింది కష్టాలను వెంట బెట్టుకొని వచ్చిందనే విధంగా పాలన సాగుతుండటంతో రైతుల్లో అసహనం వ్యక్తం అవుతున్నది. పెద్దపల్లి జిల్లాలోని మంథని, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం మండలాల్లో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. 2023 ఫిబ్రవరి నెలలో భూగర్భజలాలు 5.47మీటర్ల లోతులో ఉండగా 2024ఫిబ్రవరి మాసంలో 5.09మీటర్ల లోతులో, 2025 ఫిబ్రవరి మాసంలో 5.44మీటర్ల లోతులోకి పడిపోయాయి. బీఆర్ఎస్ పార్టీతో కక్షతో కాళేశ్వరంను పక్కన పెట్టి తెలంగాణ రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా ముంచుతున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో మోటార్లతో పని లేకుండానే కాలువల్లో సాగు నీరు పారిందని, కాళేశ్వరం గేట్లు ఎత్తడంతో బోర్లన్నీ ఎత్తిపోయి బోర్లల్లో కూడా చుక్క నీరు రావడం లేదని మూడేళ్ల దాకా ఇక సాగు అంతేనా..? అలాగైతే తాము ఎలా బ్రతుకుతామని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


2లో

## కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టారు

- ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చండి
- ఎమ్మెల్సీల విజయంతో మా బాధ్యత పెరిగింది
- ప్రజా సమస్యలపై ఇక చట్టసభల్లో నిలదీస్తాం
- సిఎం రేవంత్ గాలి మాటలకు సమాధానం చెప్పాలా
- మీడియా సమవేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

## కమిషన్ల కక్కుర్తితోనే ఎస్ఎల్‌బిఎసి ప్రమాదం

### ప్రమాదానికి ప్రభుత్వానిదే బాధ్యత: కెటిఆర్




**హైదరాబాద్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇంకొంతమంది మంత్రులు కమిషన్ల కోసం కక్కుర్తి పడడంతోనే ఎస్.ఎల్.బి. సి టన్నెల్ ప్రమాదం జరిగిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు ఆరోపించారు. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా ప్రకటించిన రెండు నివేదికలు ప్రభుత్వం దగ్గర ఉన్నప్పటికీ తమ సొంతలాభం కోసం టన్నెల్ పనులు కొనసాగించి ఎనిమిది మందిని బలిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల కోట్ల ప్రజాధనం వృథా చేయడంతో పాటు ఎనిమిది కుటుంబాల్లో ఎడతెగని శోకానికి కారణమైన ప్రమాదానికి రాష్ట్ర కేబినెట్ బాధ్యత వహిచాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టన్నెల్ పనులు చేస్తున్న జైప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ 2020లో అంబర్గ్ టెక్ ఏజి అనే సంస్థతో టన్నెల్ ప్రాంతంలో ఓ సర్వే నిర్వహించారని చెప్పారు. టన్నెల్ సిస్మిక్ ప్రెడిక్షన్ (టిఎస్‌పి) సర్వే చేసి మొన్నటి ప్రమాదాన్ని 2022లోనే అంబర్గ్ టెక్ ఏజి ఊహించి హెచ్చరించిందని అన్నారు. టన్నెల్‌లోని 13.88 కి.మీ నుండి 13.91 కి.మీ మధ్య ఫాల్ట్ జోన్ ఉందని స్పష్టంగా చెప్పారని, ఆ ప్రాంతంలోని రాళ్లు ధృడంగా లేకపోవడంతో పాటు నీటి లీకేజీలు భారీగా ఉన్న సంగతిని హైలెట్ చేశారని తెలిపారు. ఆ రిపోర్ట్‌లో ఉన్నట్టుగానే మొన్నటి ప్రమాదం ఫాల్ట్ జోన్‌లోనే జరిగిందని అన్నారు. 2022లోనే జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ జనరల్ మండపల్లి రాజుతో పాటు జైప్రకాష్ అసోసియేట్స్ భూగర్భ శాస్త్రవేత్త రితురాజ్ దేశు ముఖ్‌లు చేసిన మరో సర్వే రిపోర్ట్ కూడా ప్రభుత్వం దగ్గర ఉందని పేర్కొన్నారు. ఆ నివేదిక ప్రకారం టన్నెల్ ఉపరితలాన్ని సరిగా అంచనా వేయకుండానే నిర్మాణాన్ని మొదలుపెట్టారని చెప్పారు.

## హకీంపేట, లగచర్లలో భూసేకరణకు బ్రేక్

**వికారాబాద్ జిల్లాలో మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను నిలిపివేస్తూ హైకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.**

**నిలిపివేయాలంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులుతదుపరి విచారణ ఏప్రిల్ 7కు వాయిదా**



హైదరాబాద్: వికారాబాద్ జిల్లాలో మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను నిలిపివేస్తూ హైకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటలో 351.10 ఎకరాలు, లగచర్లలో 110.32 ఎకరాల భూసేకరణకు గతేడాది నవంబరులో జారీచేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ల అమలును నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేసింది. పూర్తివివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్, లగచర్ల డివిజన్ ఆర్డీవో, దుద్యాల తహసీల్దార్, టీఎస్ఐఐసీలకు నోటీసులు జారీచేస్తూ, తదుపరి విచారణను ఏప్రిల్ 7వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు భూసేకరణ ప్రక్రియలో ముందుకెళ్లరాదని స్పష్టం చేసింది. భూసేకరణ నోటిఫికేషన్లను సవాలు చేస్తూ కుమ్మరి శివకుమార్, పి.గోపాల్‌నాయక్, మరో 14 మంది హైకోర్టులో పిటిషన్లు దాఖలుచేశారు. దీనిపై జస్టిస్ జె.శ్రీనివాసరావు గురువారం విచారణ చేపట్టి ఈ ఆదేశాలు జారీచేశారు. అంతకుముందు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు బి.ఎస్.ప్రసాద్, వి.రఘునాథ్‌లు వాదనలు వినిపించారు. "భూసేకరణ ఎందుకు చేపడుతున్నారు? ఎంత భూమి అవసరం? అనే వివరాలేవీ నోటిఫికేషన్‌లో లేవు. సామాజిక ప్రభావ అధ్యయనం, ప్రజాభిప్రాయ సేకరణ, మార్కెట్ విలువ తదితరాలను నిర్ధారించకుండానే ప్రక్రియ చేపట్టారు. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా చేపట్టిన ఈ ప్రక్రియను నిలిపివేయాలి" అని కోరారు.

# ప్రజా ప్రభుత్వానికి సహకరిస్తా

**ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజాప్రభుత్వానికి సహకరిస్తానని వరంగల్-నల్గొండ-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందిన పింగిలి శ్రీపాల్‌రెడ్డి(పీఆర్‌టీయూటీఎస్) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హామీ ఇచ్చారు.**



హైదరాబాద్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజాప్రభుత్వానికి సహకరిస్తానని వరంగల్-నల్గొండ-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందిన పింగిలి శ్రీపాల్‌రెడ్డి(పీఆర్‌టీయూటీఎస్) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హామీ ఇచ్చారు. గురువారం ఆయన జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డిని సీఎం శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, ఏకీకృత సర్వీస్ నిబంధనలు రూపొందించి ఉన్నతస్థాయి పదోన్నతులు ఇవ్వాలని, విద్యార్థులు నష్టపోకుండా విద్యాశాఖలో ఖాళీలు ఏర్పడగానే పదోన్నతులు ఇచ్చేందుకు జీఓ 67ను పునరుద్ధరించాలని శ్రీపాల్‌రెడ్డి కోరారు. పాత పెన్షన్ వర్తింపజేయడంపై పరిశీలించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిస్తానని సీఎం చెప్పారని, పెండింగ్ బిల్లులను ఏప్రిల్ నుంచి చెల్లిస్తామన్నారని శ్రీపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీఎంను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, సంఘం మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సంఘం నేత గుండు లక్ష్మణ్ తదితరులున్నారు.

## తమిళనాడు డిప్యూటీ సీఎంకు సుప్రీంకోర్టులో ఊరట

### ఉదయనిధి స్టాలిన్‌పై కేసు నమోదు చేయొద్దని ఆదేశాలు



చెన్నై,చండీఘడ్:డీఎంకే నేత, తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్‌కు సుప్రీంకోరు ఊరట కల్పించింది. సనాతన ధర్మంపై ఆయన చేసిన వ్యాఖ్యలకు గానూ కొత్త కేసులు ఏవీ నమోదు చేయొద్దని సర్వోన్నత న్యాయస్థానం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. కాగా, 'సనాతన ధర్మం'పై ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలపై హిందూ సంఘాలు, పలువురు తీవ్రంగా తప్పుపట్టారు. ఇక ఆయన వ్యాఖ్యలపై దేశావ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో అనేక ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదయ్యాయి. తాజాగా బీహార్‌లో ఇదే అంశంపై మరో కేసు నమోదైంది. దీంతో ఉదయనిధి స్టాలిన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వివిధ రాష్ట్రాల్లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఏకీకృతం చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. సనాతన ధర్మం అంశంలో కోర్టు అనుమతి లేకుండా ఉదయనిధి స్టాలిన్‌పై కొత్త కేసులు ఏవీ నమోదు చేయొద్దని ఆదేశించింది. 2023లో చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ.. "సనాతన ధర్మం' డెంగీ, మలేరియా లాంటిది. దాన్ని నిర్మూలించాలి' అంటూ వ్యాఖ్యానించారు. దీంతో స్టాలిన్ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేగాయి. ఈ వ్యాఖ్యలపై పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే, ఉదయనిధి మాత్రం తన వ్యాఖ్యలకు కట్టుబడే ఉన్నానని.. ఈ విషయంలో క్షమాపణలు చెప్పేదే లేదని తెగేసి చెప్పారు.

వేగుచుక్క
కీచిత శ్రుతల గొంతుక...

# పీఎఫ్ ఖాతా బోగస్ కంపెనీకి లింకైందా?




ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ కలిగిన ఉద్యోగులకు బిగ్ అలర్ట్. మీ పీఎఫ్ ఖాతా ఏదైనా బోగస్ కంపెనీకి లింకైందా? ఓసారి చెక్ చేసుకోండి. అలా అయితే మీ డబ్బులు మొత్తం ఖాళీ అవడమే కాకుండా మూన్ లైటింగ్ సమస్య ఎదుర్కోవలసి వస్తుంది. మరి ఎలా డీలింక్ చేయాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం.

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఈపీఎఫ్ఓలో అకౌంట్ ఉన్న ఉద్యోగులందరికీ బిగ్ అలర్ట్. ఇటీవల హైదరాబాద్‌కి చెందిన ఓ ఉద్యోగి సైబర్ నేరగాళ్లకు లొంగకపోవడంతో అతడి ప్రావిడెంట్ ఫండ్ అకౌంట్ ను బోగస్ కంపెనీకి అనుసంధానం చేశారు. అది తెలియకుండా మరో కంపెనీకి ఇంటర్వ్యూకు వెళ్లడంతో ఒకేసారి రెండు కంపెనీల్లో పని చేస్తున్నట్లు రికార్డుల్లో కనిపించింది. దీంతో మూన్ లైటింగ్ చేశారని ఉద్యోగం అవకాశం కోల్పోవాల్సి వచ్చింది. డిమాండ్ చేసిన డబ్బులు ఇవ్వలేదనే కారణంగా బోగస్ కంపెనీలకు పీఎఫ్ ఖాతాలను లింక్ చేస్తున్నారు నేరగాళ్లు. మీ ఖాతాను ఓసారి చెక్ చేసుకోండి. మీ పీఎఫ్ ఖాతా సైతం తెలియని కంపెనీకి లింక్ అయితే ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

బోగస్ కంపెనీలకు లింకైన పీఎఫ్ ఖాతాలను తొలగించాలంటో గతంలో ఈపీఎఫ్ఓకు పరిపాలన, సాంకేతిక పరిమైన అడ్డంకులు ఎదురయ్యేవి. కానీ, ఇప్పుడు ఉద్యోగులే సొంతంగా బోగస్ కంపెనీ వివరాలను తొగించుకునేందుకు డీలింక్ ఆప్షన్ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈపీఎఫ్ఓ రూల్స్ ప్రకారం ఒక వ్యక్తి ఒకేసారి రెండు కంపెనీల్లో పని చేయకూడదు. ఈ నిబంధనను ఆసరగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు ఉద్యోగులను డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వని వారి పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను యూపీ, రాజస్థాన్, ఒడిశా, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో నమోదు చేసిన బోగస్ కంపెనీలకు జత చేస్తున్నారు. ఇలాంటి మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు ఇటీవల పెరగడంతో ఈపీఎఫ్ఓ డీలింక్ ఆప్షన్ తీసుకొచ్చింది.

### డీలింక్ ఎలా చేయాలి?

1పీఎఫ్ ఖాతాదారులు ముందుగా ఈపీఎఫ్ మెంబర్ పోర్టల్‌లోకి యూఏఎన్ నంబర్, పాస్‌వర్డ్ సాయంతో లాగిన్ కావాలి. 1హోం పేజీలో వ్యూ ఆప్షన్లలో ఉండే సర్వీస్ హిస్టరీపై క్లిక్ చేయాలి. 1ఈ సర్వీసు హిస్టరీలో మీ పీఎఫ్ అకౌంట్, కంపెనీల పేర్లు కనిపిస్తాయి. మీ పీఎఫ్ ఖాతా తెలియకుండా ఏదైనా కంపెనీతో లింకై ఉంటే దాని పక్కనే డీలింక్ ఆప్షన్ కనిపిస్తుంది. 1బోగస్ కంపెనీకి చెందిన డీలింక్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత ఆధార్ లింక్ అయిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. 1ఈ ఓటీపీని ఎంటర్ చేసి సబ్మిట్ చేస్తే డీలింక్ ప్రక్రియ పూర్తవుతుంది. 1 ఆ తర్వాత సర్వీసు హిస్టరీ చెక్ చేస్తే డీలింక్ అయిన కంపెనీల వివరాలు కనిపించవు. 1ఒక వేళ ఉద్యోగి నిజంగానే ఒకేసారి రెండు కంపెనీల్లో పని చేస్తే, రెండు కంపెనీలు చందా చెల్లించినట్లయితే డీలింక్ చేసేందుకు కుదరదు. ఎర్రర్ వస్తుంది. 1డీలింక్ చేసే సంస్థ విషయంలో పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని ఈపీఎఫ్ఓ సూచిస్తోంది.

# లోన్ వడ్డీ రేట్లు పెంచిన రెండు దిగ్గజ బ్యాంకులు..




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొద్ది రోజుల కిందట కీలక రెపో రేట్లను తగ్గించిన సంగతి తెలిసిందే. దీంతో బ్యాంకులు రెపో ఆధారిత వడ్డీ రేట్లను తగ్గించే పనిలో పడ్డాయి. ఇప్పటికే చాలా బ్యాంకులు తగ్గించేశాయి. ఇదే సమయంలో కొన్ని బ్యాంకులు ఎంసీఎల్ఆర్‌లో కూడా కీలక మార్పులు చేశాయి. కొన్ని ఎంసీఎల్ ఆర్ పెంచగా.. ఇంకొన్ని తగ్గించాయి.

బ్యాంకుల్లో లోన్లు తీసుకునే వారికి ఇటీవల ఆర్బీఐ నిర్ణయంతో ఊరట కలిగిందన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఐదేళ్ల తర్వాత రెపో రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో 6.50 శాతం నుంచి 6.25 శాతానికి దిగొచ్చింది. దీంతో ఇదే సమయంలో రెపో ఆధారిత వడ్డీ రేట్లు ఇప్పటికే చాలా బ్యాంకుల్లో తగ్గాయి. దీంతో ఆయా లోన్లపై ఈఎంఐ లేదా టెన్యూర్ తగ్గుతుందని చెప్పొచ్చు. ఇంకా.. చాలా బ్యాంకులు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను కూడా ఫిబ్రవరి నెలలో సవరించాయి. రెండు బ్యాంకులు పెంచగా.. ఒక బ్యాంకు మాత్రం తగ్గించింది. కొన్నేమో యథాతథంగానే ఉంచాయి.

ఎంసీఎల్ఆర్ అంటే రుణ ఆధారిత వడ్డీ రేట్లు. దీనినే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లు అంటారు. అం టే.. ఇక్కడ ఈ ఎంసీఎల్ఆర్ కంటే తక్కువ వడ్డీకి బ్యాంకులు లోన్లు ఇచ్చేందుకు వీల్లేదు. అన్ని బ్యాంకులకు ఒకే విధానం ఉండాలన్న ఉద్దేశంతో ఆర్బీఐ ఈ విధానం తీసుకొచ్చిం ది. ఎంసీఎల్ఆర్ పెంచితే.. లోన్ ఈఎంఐ పెరుగుతుంది. ఎంసీఎల్ఆర్ తగ్గిస్తే.. లోన్ ఈఎంఐ తగ్గుతుందని చెప్పొచ్చు.

ప్రభుత్వ రంగానికి చెందిన ప్రముఖ బ్యాంకుల్లో ఒకటైన కెనరా బ్యాంకు.. ఎంసీఎల్ఆర్ తగ్గించింది. ఇక్కడ గరిష్ఠంగా 15 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఒక నెల టెన్యూర్‌పై ఎంసీఎల్ఆర్ 10 బేసిస్ పాయింట్లు తగ్గి 8.45 శాతం నుంచి 8.30 శాతానికి తగ్గింది. ఇక ఇతర టెన్యూర్లపై ఎంసీఎల్ఆర్ ఏం మారలేదు. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 8.35 శాతంగా ఉంది. 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.55 శాతంగా ఉంది. 6 నెలల ఎంసీఎల్ఆర్ 8.90 శాతంగా ఉంది. ఏడాది ఎంసీఎల్ఆర్ చూస్తే 9.10 శాతంగా ఉంది. రెండేళ్ల ఎంసీఎల్ఆర్ ఇక్కడ 9.35 శాతం ఉండగా.. ఇవి ఫిబ్రవరి 12 నుంచి అమల్లోకి వచ్చాయి.

### అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకు..

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎంసీఎల్ఆర్ స్వల్పంగా పెంచింది. ఇక్కడ ఓవర్‌నైట్ టెన్యూర్ ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరగ్గా 9.20 శాతానికి చేరింది. ఇందులో అన్ని టెన్యూర్లపై 9.20 శాతం నుంచి 9.45 శాతంగా ఉన్నాయి. ఫిబ్రవరి 7 నుంచి ఇవి వర్తిస్తున్నాయి. ఇక ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు.. పంజాబ్ నేషనల్ బ్యాంకులో లెండింగ్ రేట్లు 5 బేసిస్ పాయింట్ల మేర పెరిగాయి. ఇది అన్ని టెన్యూర్లపై వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఫిబ్రవరి 1 నుంచే ఇది అమల్లోకి వచ్చింది. ఇక్కడ కనీసం 8.40 శాతం నుంచి గరిష్ఠంగా 9.35 శాతంగా ఎంసీఎల్ఆర్ ఉంది. ఇక ఐడీబీఐ బ్యాంకులో రుణ రేట్లు మారలేదు. ఇవి 8.45 శాతం నుంచి 10.15 శాతంగా ఉన్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడాలోనూ స్థిరంగానే ఉన్నాయి. దీంట్లో 8.15 శాతం నుంచి గరిష్ఠంగా 9 శాతంగా ఉంది. ఇది ఫిబ్రవరి 12 నుంచే అమలవుతోంది.

# అంబానీకి చుక్కెదురు..

2000 సంవత్సరంలో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం న్యూ ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్సింగ్ పాలసీ తొలి విడతలో రిలయన్స్ కన్సార్షియానికి కేజీ డీబ్ల్యూఎస్ 98/3 కేజీ- డీ6 బ్లాక్ గ్యాస్ వెలికితీత కోసం కేటాయించింది. ఇందులో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 90 శాతం, కెనడాకు చెందిన నికో రిసోర్సెస్‌కు 10 శాతం వాటా ఉంది. అయితే దాదాపు 10 ఏళ్ల తర్వాత బీపీ సంస్థకు రిలయన్స్ 30 శాతం వాటాను విక్రయించింది. తర్వాత కాలంలో దీనిని ప్రభుత్వం రంగ కంపెనీ అయిన ఆయిల్ అండ్ నేచరల్ గ్యాస్ కార్పొరేషన్ కొనుగోలు చేసింది. దీని పక్కనే ఉన్న గోదావరి బ్లాక్‌ను ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో 1997లో ఓఎన్జీసీకి కేటాయించింది.

రిలయన్స్, ఓఎన్‌జీసీ మధ్య 2013లో వివాదం మొదలైంది. ఓఎన్‌జీసీ కేజీ–డీ5 బ్లాక్, జీ–4 బ్లాక్ రిజర్వాయర్ల నుంచి రిలయన్స్ కేజీ–డీ6 బ్లాక్ కనెక్టివిటీ ఉందని అనుమానిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ కి లేఖ రాసింది. గోదావరి, కేజీ–డీడబ్ల్యూఎన్ 98/2 బ్లాకుల్లో ఉన్న జియోలాజికల్ అండ్ జియోఫిజికల్ వివరణాత్మక డేటా ద్వారా రిలయన్స్ బ్లాక్, ఓఎన్‌జీసీ బ్లాక్‌ల మధ్య గ్యాస్ కనెక్టివిటీ ఉందని తెలిపింది. మొదట గ్యాస్ ఉత్పత్తిని ప్రారంభించిన రిలయన్స్ ఇండస్ట్రీస్ పూర్తి స్థాయిలో ఓఎన్ జీసీ వనరులను సైతం వాడుకుందని తెలిపింది. ఆ తర్వాత 2014 మే 15వ తేదీన ఢిల్లీ హైకోర్టులో రిలయన్స్ గ్యాస్ చోరీపై రిట్ పిటిషన్ దాఖలు చేసింది. 2014 సెప్టెంబర్ 10వ తేదీన ప్రభుత్వం ఈ విషయంపై ఓ నిర్ణయం తీసుకోవాలని ఓఎన్‌జీసీ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీనిపై థర్డ్ పార్టీ అధ్యయనం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డిగోలెయర్, మ్యాక్ నాటన్ కన్సల్టెంట్‌ను నియమించింది. ఈ కంపెనీ 2015 నవంబర్ 19వ తేదీన నివేదిక ఇచ్చింది. 2009 ఏప్రిల్ 1 నుంచి 2015 మార్చి 31 వరకు ఓఎన్‌జీసీకి చెందిన రూ.10 వేల కోట్ల విలువైన గ్యాస్‌ను రిలయన్స్ ఉత్పత్తి చేసి విక్రయించిందని తేల్చి చెప్పింది. రిలయన్స్ దాని భాగస్వామ్య బీపీ, నికోలు 1.55 బిలియన్ డాలర్లను ఓఎన్‌జీసీకి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిని వ్యతిరేకించిన రిలయన్స్ ఆర్బిట్రేషన్‌కు వెళ్లింది. 2018 జులై నెలలో అంతర్జాతీయ మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్ ప్రభుత్వం క్లెయిమ్ చేసిన రూ.13,500 కోట్లకు చెందిన పేమెంట్లను తోసిపుచ్చింది. అంతర్జాతీయ మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పులో వివాదం లేదని, జస్టిస్ అనూప్ భంబానీ నేతృత్వంలోని సింగిల్ బెంచ్ పేర్కొంది. జస్టిల్ రేఖపల్లి, జస్టిస్ సౌరభ్ బెనర్జీలు 2023 మే 9వ తేదీన 2018 ఆర్బిట్రేషన్ తీర్పును తోసిపుచ్చుతూ ఫిబ్రవరి 15వ తేదీన తీర్పు వెలువరించింది.




# ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత!

బ్యాంకులో పొదుపు ఖాతా అనేది దాదాపు అందరి వద్ద ఉంటుంది. సేవింగ్స్ అకౌంట్ లోని బ్యాలెన్స్ పైనా బ్యాంకులు వడ్డీ చెల్లిస్తాయి. బ్యాలెన్స్ బట్టి ఈ వడ్డీ ఉంటుంది. అయితే, ఈ ప్రైవేట్ రంగ దిగ్గజ బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేట్లను తగ్గించి ఖాతాదారులకు షాకిచ్చింది. ఏకంగా 50 బేసిస్ పాయింట్ల మేర కోత పెట్టింది. ఆ వివరాలు తెలుసుకుందాం.

ప్రైవేట్ రంగ దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన కోటక్ మహీంద్రా బ్యాంక్ తమ ఖాతాదారులకు షాకిచ్చింది. తమ బ్యాంకులో సేవింగ్స్ అకౌంట్ కలిగి ఉన్న వారికి బ్యాడ్‌న్యూస్ చెప్పింది. పొదుపు ఖాతా వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కోటక్ మహీంద్రా బ్యాంకులో రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు బ్యాలెన్స్ పై ఇస్తున్న పొదుపు ఖాతాలపై ఈ వడ్డీ రేట్ల తగ్గింపు ఉంటుందని తెలిపింది. అకౌంట్ బ్యాలెన్స్ ఆధారంగా వడ్డీ రేట్లు అందిస్తోంది. సవరించిన కొత్త వడ్డీ రేట్లు ఫిబ్రవరి 17, 2025 నుంచే అమలులోకి తీసుకొస్తున్నట్లు కోటక్ మహీంద్రా బ్యాంక్ తన అధికారిక వెబ్‌సైట్లో పేర్కొంది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును తగ్గిస్తున్నట్లు ఫిబ్రవరి 7, 2025 రోజున ప్రకటించిన సంగతి తెలిసిందే. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించింది. ఆర్‌బీఐ నిర్ణయం తర్వాత కోటక్ మహీంద్రా బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్ల వడ్డీ రేటులో కోత పెట్టింది. రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల మధ్య బ్యాలెన్స్ ఉన్న ఖాతాలపై వడ్డీ రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టినట్లు కోటక్ బ్యాంక్ తెలిపింది. ఈ కోటక్ బ్యాంకులో సేవింగ్స్ అకౌంట్లు, అందులోని బ్యాలెన్స్ ఆధారంగా తాజా వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

కోటక్ బ్యాంక్ డైలీ సేవింగ్స్ అకౌంట్స్ బ్యాలెన్స్ రూ.5 లక్షల వరకు ఉంటే వార్షిక వడ్డీ రేటు 3 శాతంగా ఉంది.

ఇప్పటి వరకు రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు 3.50 శాతం వడ్డీ ఇస్తుండగా దానిని 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టి 3 శాతానికి తగ్గించింది.

అలాగే రూ.50 లక్షల పైన బ్యాలెన్స్ ఉండే ఖాతాలపైనా వడ్డీ రేటులో 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఇప్పటి వరకు 4 శాతం వడ్డీ ఇస్తుండగా దానిని 3.50 శాతానికి తగ్గించింది.

ఈ కొత్త వడ్డీ రేట్లు రెసిడెంట్, నాన్ రెసిడెంట్ అకౌంట్లు రెండింటికీ వర్తిస్తాయని బ్యాంక్ తెలిపింది.

సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేట్లు ఎలా లెక్కిస్తారు?

సేవింగ్స్ అకౌంట్లపై వడ్డీ రేట్ల లెక్కింపు ఏప్రిల్ 1, 2016 నుంచి త్రైమాసిక పద్ధతిన లెక్కిస్తున్నారు. డైలీ ప్రొడక్ట్ ఆధారంగా లెక్కించి మూడు నెలలకు ఒకసారి ఖాతాలో జమ చేస్తారు. ఆర్థిక సంవత్సరంలో జూన్ 30, సెప్టెంబర్ 30, డిసెంబర్ 31, మార్చి 31వ తేదీన ఖాతాల్లో వడ్డీ జమ చేస్తారు.

# నీరు లేక అల్లాడుతున్న పాకిస్తాన్..

## 700 అడుగులు తవ్వినా చుక్క నీరు రావట్లే..!



పాకిస్తాన్ నెత్తిపై మరో పిడుగు వచ్చిపడింది. ఇప్పటికే అప్పులు, విదేశీ మారక నిల్వలు అడుగంటిపోవడం, ఆకలి కేకలు, రాజకీయ అస్థిరత, ఆర్మీ నియంత్రణతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్న దాయాది దేశం ఇప్పుడు మరో సమస్యలో చిక్కుకుంది. నీరు లేక ఆ దేశం అల్లాడిపోతోంది. వందల అడుగుల లోతుకు వెళ్లినా నీటి చుక్క కానరావడం లేదు. దీంతో నీరు లేక పాక్‌వాసులు.. తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారు. దాయాది దేశం పాకిస్తాన్‌లో నీటి కొరత తీవ్ర స్థాయికి చేరుకుంది. అక్కడి భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతున్నాయి. దీంతో ఎన్ని అడుగుల మేర తవ్వినా ఒక్క చుక్క నీరు కూడా కనిపించ దం లేదు. 700 అడుగులు తవ్వినా నీళ్లు రాకపోవడంతో.. పాక్‌వాసుల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే తిండి లేక విలవిలలాడుతుండగా మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు.. ఇప్పుడు నీటి సమస్య కూడా పెరిగిపోవడంతో.. ఏం చేయాలో, ఎలా బతకాలో అర్థం కాక పాకిస్తాన్ ప్రజలు అయోమయంలో మునిగిపోయారు. పాకిస్తాన్‌లో 1990ల్లో నీటి మట్టం 100 అడుగులు ఉండగా.. అప్పటి నుంచి క్రమంగా తగ్గుతూ వస్తూ ఇప్పుడు 700 అడుగులకు పడిపోయినట్లు అక్కడి శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇక ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్నది వేసవి కాలం కావడంతో.. పరిస్థితి ఇంకెంత భయంకరంగా ఉంటుందోనని పాకిస్తాన్ సతమతంలో పడింది. ఇప్పటికే ఫిబ్రవరి, మార్చి నెలల్లో తక్కువ వర్షపాతం నమోదు అవుతుందని పాకిస్తాన్ వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలోనే పాకిస్తాన్‌లో కరువు పరిస్థితులు ఎదురవుతాయని హెచ్చరించింది. వాతావరణ శాఖ హెచ్చరికలతో అలర్ట్ అయిన రావల్పిండి నగర నీరు, పారిశుద్ధ్య సంస్థ.. నగరంలో ప్రజల నీటి అవసరాలకు సంబంధించి ముందు జాగ్రత్తగా కీలక సూచనలు చేసింది. రావల్పిండి నగరాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటిస్తూ.. ప్రజలకు నీటి కొరత గురించి తీవ్ర హెచ్చరికలు చేసింది. ఇది కట్టుడు పళ్ల కంటే 300 రెట్లు ఉత్తమం! మరియు ధర చాలా చౌకగా ఉంటుంది

పాకిస్తాన్ వార్తాపత్రిక అయిన డాన్‌లో వచ్చిన ఒక రిపోర్ట్ ప్రకారం.. రావల్పిండిలోని గారిసన్ నగరంలో నివసిస్తున్న ప్రజలకు కరువు కారణంగా నీటి కొరత ఎక్కువగా ఏర్పడిందని రావల్పిండి నగర నీరు, పారిశుద్ధ్య సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ముహమ్మద్ సలీం అష్రఫ్ వెల్లడించారు. దీంతో పాటు జనాభా వేగంగా పెరుగుతుం డటం, అనేక ఆర్థిక కార్యకలాపాలు, వనరుల కొరత కూడా ఈ నీటి కొరతకు కారణం అమవుతున్నాయని చెప్పారు.

అయితే పాకిస్తాన్‌లో సీజన్‌లో వర్షాలు ఎక్కువగా కురవకపోవడం కూడా ఈ సమస్యకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. చాలా కాలంగా వర్షాలు పడకపోవడంతో రిజర్వాయర్లు, భూగర్భ జల వనరుల్లో నీటిమట్టం వేగంగా తగ్గిపోయిందని ముహమ్మద్ సలీం అష్రఫ్ తెలిపారు. ఈ కారణంగానే పాక్ ప్రజలు నీటి కొరతను ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. రావల్పిండి నగరానికి ప్రతిరోజూ 68 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం అవుతాయని పేర్కొన్నారు. అయితే రావల్-ఖాన్పూర్ ఆనకట్టలు, 490కి పైగా బోర్లు సహా ప్రస్తుతం ఉన్న అన్నిరకాల నీటి వనరులను ఉపయోగించినా.. 51 మిలియన్ గ్యాలన్ల నీరు మాత్రమే అందుతోందని చెప్పారు. అంటే ఇప్పటికే రావల్పిండి నగరంలో నీటి సమస్య ఉందని.. రానున్న కాలంలో అది మరింత ఎక్కువ అయ్యే పరిణామాలు కనిపిస్తున్నాయని.. స్థానిక అధికారులు పేర్కొంటున్నారు.

# కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టారు



**హైదరాబాద్:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఆశీర్వదించి అఖండ విజయాన్ని కట్టబెట్టిన తెలంగాణ సమాజానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు . బీజేపీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకున్న సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈ విజయం తెలంగాణ సమాజానికి, ఉపాధ్యాయులకు అంకితం ఇస్తున్నామని అన్నారు.రెండు ఎమ్మెల్సీలు ఏక కాలంలో రావడం చాలా సంతోషం. గత పార్లమెంటు ఎన్నికల్లో ప్రత్యామ్నాయ పార్టీగా బీజేపీని ఆదరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్దీ నెలల్లోనే కాంగ్రెస్ తో సమానంగా తెలంగాణ సమాజం బీజేపీకి ఎంపీ సీట్లు కట్టబెట్టింది . మూడు స్థానాల్లో

రెండు కీలకమైనవి. కాంగ్రెస్ సిట్టింగ్ స్థానంలో బీజేపీని గెలిపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసం చేశాయని గ్రహించే రాష్ట్ర ప్రజలు బీజేపీని గెలిపించారని కిషన్ రెడ్డి అన్నారు. రెండు ఎమ్మెల్సీల విజయంతో బీజేపీ బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి బీజేపీపైన అనేక తప్పుడు ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన రెండు ఎన్నికల్లో బీజేపీని గెలిపించారని.. కాంగ్రెస్ కు కర్రు కాల్చి వాత పెట్టారని కిషన్ రెడ్డి అన్నారు. శాసన మండలి, సభలో ప్రజల సమస్యలపైన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం అన్నారు. శాసన మండలి, సభలో తెలంగాణ ప్రజల గుండె చప్పుడు వినిపిస్తాం. తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉంది. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పాలనకు రెఫరండమని తాము అనడం లేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఇప్పటివరకైనా నెరవేర్చాలని గుర్తు చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ గిఫ్ట్ మాకు అవసరం మాకు లేదు.. రాహుల్ గాంధీకి ఇచ్చుకోండి. తెలంగాణ ప్రజలు మాకు గిఫ్ట్ ఇస్తున్నారు.. ఇస్తారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని కిషన్ రెడ్డి కాంగ్రెస్‌ను విమర్శించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గాలి మాటలకు సమాధానం చెప్పాలా అని

షన్‌రెడ్డి ప్రశ్నించారు. సీఎం గాలి మాటలకు సమాధానం, సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి నాపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. ఆ ఆరోపణలకు ప్రజలే సరైన సమాధానం ఇచ్చారు. ప్రజా తీర్పు.. కాంగ్రెస్ పాలనకు చెంపపెట్టులాంటిదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి. రైతులకు ఎకరాకు రూ.15 వేలు, యువతకు నిరుద్యోగ భృతి, ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, దళితులకు రూ.12 లక్షలు, ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని ఆ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నాం.



# ఢిల్లీ భూకంప సమయంలో "బూమ్" శబ్దాలు..

ఢిల్లీలో సోమవారం రోజు వేకువజామున భూకంపం సంభవించింది. విషయం గుర్తించిన ఢిల్లీ ప్రజలంతా ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. విపరీతంగా భయపడిపోతూనే చిన్న పిల్లలను ఎత్తుకుని, ముసలి వాళ్లను పట్టుకుని.. ప్రాణ భయంతో బిక్కుబిక్కుమంటూ రోడ్లపై కూర్చున్నారు. ఓవైపు భూమి కంపిస్తుండగానే.. మరోవైపు భారీ స్థాయిలో బూమ్ అంటూ శబ్దాలు రాగా.. మరింతగా వణికిపోయారు జనాలు. ఏం చేయాలో పాలుపోక నరకం చూశారు. అయితే ఈ బూమ్ శబ్దం రావడం వెనుక అసలు కారణం అదేనంటూ శాస్త్రవేత్తలు షాకింగ్ విషయాలు వెల్లడించారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

సోమవారం వేకువజామున 5.36 గంటలకు ఢిల్లీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 4.0 తీవ్రతో భూమి కనిపించగా.. ప్రజలంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతుండగా.. భూకంప సమయంలో భారీ స్థాయిలో బూమ్ అంటూ శబ్దాలు వచ్చాయి. అవి కూడా వీడియోల్లో వినిపిస్తున్నాయి. అయితే ఇలా చప్పుళ్లు రావడం వెనుక మరేదో పెద్ద కారణమే ఉందని అంతా భావించారు. అది నిజమేనని శాస్త్రవేత్తలు తాజాగా వెల్లడించారు.

తక్కువ లోతులో ఉండే భూకంప కేంద్రం ఏర్పడినప్పుడు ప్రకంపన సమయంలో ఈ బూమింగ్ శబ్దాలు వినిపిస్తుంటా యని అమెరికా జియోలాజికల్ సర్వే నిపుణులు చెప్పుకొ చ్చారు. ఆ సమయంలో భూమిపై ప్రకంపనలు రావడంతోపాటు స్వల్ప కాలం వచ్చిన భూతరంగాలు గాల్లో కలిసి ధ్వని తరంగాలుగా మారతాయని వివరించారు. అధిక ఫ్రీక్వెన్సీ కంపనాల కారణంగా బూమ్ అనే శబ్దం వస్తుందని చెప్పారు. కొన్నిసార్లు కంపనాలు జరక్కపోయినా.. ఈ భారీ శబ్దాలు వచ్చే అవకాశం ఉందన్నారు. భూకంప కేంద్రం లోతు ఎంత తక్కువగా ఉంటే అంత ఎక్కువగా బూమ్ అనే శబ్దాలు వినిపిస్తాయని చెప్పారు. ఈరోజు ఢిల్లీ, బిహార్‌లో వచ్చిన ప్రకంపనల్లో భూకంప కేంద్రాలు 5 కిలో మీటర్ల నుంచి 10 కిలో మీటర్ల లోతులోనే ఉన్నాయని.. అందుకే పెద్ద ఎత్తున బూమ్ అనే శబ్దాలు వచ్చినట్లు వెల్లడించారు. ఇదంతా ఇలా ఉండగా.. మళ్లీ ఢిల్లీ, బిహార్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో భూకంపాలు వచ్చే అవకాశం ఉందని.. ప్రజలంతా చాలా జాగ్రత్తగా ఉండాలని నేరుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీయే వెల్లడించారు. చూడాలి మరి ముమ్ముందు ఏం జరగనుంది అనేది.

# ఒకే ఇంట్లో శవాలై తేలిన కుటుంబ సభ్యులు..

కర్ణాటకలోని మైసూరులో విషాద ఘటన చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం కలవరపాటుకు గురి చేసింది. మైసూరులోని విశ్వేశ్వరయ్య నగర్‌లో సోమవారం తెల్లవారుజామున ఈ ఘటన వెలుగు లోకి వచ్చింది. ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఒక కుటుంబ ంలో ఏకంగా నలుగురు వ్యక్తులు విగత జీవులుగా కనిపించడంతో మృతులను మైసూరులో వ్యాపారం చేస్తున్న చేతన్(45), అతని భార్య రూపాలి (43), వారు కుమారుడు కుశాల్(15), చేతన్ తల్లి ప్రియంవద(65)గా పోలీసు అధికారులు గుర్తించారు. వ్యాపారి చేతన్ మొదట తన భార్య, కుమారుడు, తల్లికి విషమిచ్చి వారు చనిపోయారు అని నిర్ధారించు కున్న తర్వాత తాను ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి నట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. వీరి ఆత్మహత్యకు అప్పుల బాధలే కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులే వారిని ఆత్మహత్య కు ఉసిగొల్పినట్లు భావిస్తున్నారు. ఈ దారుణానికి ఒడిగట్టే ముందు చేతన్ అమెరి కాలో ఉంటున్న తన సోదరుడికి కాల్ చేసి, తన ఆర్థిక సమస్యల గురించి చెప్పుకున్నాడని, అప్పుల ఒత్తిడి తట్టుకోలేక కుటుంబంతో సహా ప్రాణాలు తీసుకుంటు న్నట్లు చెప్పి ఫోన్ కట్ చేసినట్లు పోలీసులు వివరాలు తెలిపారు.

# కార్యకర్తలే పార్టీకి "వెన్నెముక"

## - బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 6**



కార్యకర్తలే పార్టీకి "వెన్నెముక" అని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం ప్రజల్లో తమ పార్టీకి ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి అన్నారు.
బీజేపీ జిల్లా కార్యాలయం లో పార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలలో బూత్ కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, టీచర్స్ ఎమ్మెల్సీ గా మల్క కొమురయ్య, పట్టుభద్రుల ఎమ్మెల్సీగా అంజి రెడ్డిని గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలుపారు. వారి గెలుపు లో బూత్ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు ప్రతి కార్యకర్త కష్టపడ్డారని అన్నారు. ఇది స్థానిక సంస్థల ఎన్నికలకు పునాది అని, కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పైన విశ్వాసం తో ఇందూరు జిల్లా నుంచి అత్యధిక మెజార్టీ రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదే విధమైన స్ఫూర్తి తో రాబోయే ఎన్నికలలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తమను ప్రతి రోజు ఎంపీ అర్వింద్ ధర్మపురి, ఎమ్మెల్యే లు ధన్ పాల్ సూర్యనారాయణ, రాకేష్ రెడ్డి ఎప్పటికప్పుడు పార్టీ పనులను పర్యవేక్షించి ఈ గెలుపు లో కీలకంగా పనిచేయడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని ఎంత హింసించారో నిన్నటి వీడియో తో అర్థం అయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, కేంద్రం అభివృద్ధి పనులతో రాష్ట్రము లో బీజేపీ జెండా ఎగురేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు, పోతనకర్ లక్ష్మి నారాయణ, జిల్లా అధికార ప్రతినిధి బుసాపూర్ శంకర్, రూరల్ కన్వీనర్ పద్మారెడ్డి, జిల్లా కార్యాలయ కార్యదర్శి బద్దం కిషన్, కార్పొరేటర్లు మెట్టు విజయ్, మండల అధ్యక్షులు గడ్డం రాజు, ఇప్పకాయల కిషోర్, ఆనంద్ రావు,
మల్లేష్ గుప్తా, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాదల నరేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అమందు విజయ్ కృష్ణ, బీజేవైఎం నాయకులు వినోద్ రెడ్డి, దేవా నాయక్, నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం.

## - ఘనంగా దంత వైద్యుల దినోత్సవం.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మార్చి 6:**





ఇండియన్ డెంటల్ అసోషియన్ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా దంత వైద్యుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 10 మంది దంత వైద్యుల బృందం జిల్లా కేంద్రంలోని ఓరియంటల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు దంతాల పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దంత వైద్య శిబిరంలో డాక్టర్ నిమ్మ అభిషేక్ రెడ్డి, డాక్టర్ కవిత, డాక్టర్ యండి సాజిద్, డాక్టర్ యండి సారా, డాక్టర్ నిమ్మ క్రాంతి, డాక్టర్ నాగరాజ్ యెల్లా, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ రాకేష్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ మౌనిక మరియు పాఠశాల ప్రిన్సిపాల్ పి. మురళి రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గెరిగంటి లక్ష్మినారాయణ, పాఠశాల టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలు ప్రశాంతం.

## - 420 గైర్హాజరు, ఒకరి పై మాల్ ప్రాక్టీస్ కేసు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 6:**



ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం రెండవ సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ భాష సబ్జెక్టతో పరీక్ష లు ప్రారంభమయ్యాయని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు. 420 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, ఒక విద్యార్థి చీటీలు రాయగా పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశామని అన్నారు. మొత్తం జిల్లాలో 16,343 మంది విద్యార్థులకు గాను 15,923 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలియజేశారు. మొత్తం 97.4 శాతం విద్యార్థులు పరీక్షలు రాయగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించామని తెలియజేశారు.
జిల్లా కలెక్టర్ ధర్మారంలోని సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల తనిఖీ చేసి పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 49 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. నిజామాబాద్ ఖిల్లా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల – బీ సెంటర్ లో ఓ విద్యార్థి చీటీలు రాస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసింది. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతో పాటు తాను ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ లు,
హై పవర్ కమిటీ, బల్క్ అధికారి, కస్టోడియన్లు తనిఖీ చేసి పర్యవేక్షణ చేసారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలియజేశారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి శ్రీ తిరుమలపూడి రవికుమార్
నిజామాబాద్ పట్టణంలోని ఖిల్లా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఏ సెంటర్, బి సెంటర్ , నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, కంటేశ్వర్ లోని ఎస్సార్ జూనియర్ కళాశాలలను, రవి కాకతీయ జూనియర్ కళాశాల ఏ సెంటర్, బీ సెంటర్, మహిళా కాకతీయ జూనియర్ కళాశాలలను తనిఖీ చేసి సమీక్షించారు.



# ఒంటరి మహిళల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం చేయాలి.

## - బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 6:**



దేశంలో ప్రతి గ్రామంలో వందలాది మంది ఒంటరి మహిళలు అనేక ఆర్థిక ఇబ్బందులతో జీవిస్తున్నారని, వారి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం చేయాలని బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్ లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం, భారతదేశ మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రమ్మ పూలే వర్ధంతి సందర్భంగా బహుజన శ్రామిక మహిళలు అనే అంశంపై
జరిగిన జిల్లా సదస్సులో ఆమె మాట్లాడారు. 1909లో అమెరికాలోని న్యూయార్క్ నగరంలో సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో సమాన పనికి వేతనం, పని గంటలు తగ్గింపు, ఓటు హక్కు తదితర సమస్యలపై 15000 మంది శ్రామిక మహిళలు మొట్టమొదటి సారిగా గళం విప్పిన రోజునే అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా
చరిత్రలో మిగిలిపోయిందని అన్నారు. భారతదేశంలో బహుజన శ్రామిక మహిళల హక్కులపై విరామం మెరుగని పోరాటాలు నిర్వహించిన చదువుల తల్లి సావిత్రమ్మ పూలే పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ, బహుజన శ్రామిక మహిళా ఉద్యమాలు తమ భుజస్కంధాలపై మోస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచినప్పుడే బహుజన శ్రామిక మహిళల హక్కులు, సంక్షేమం, సామాజిక న్యాయం సమగ్రాభివృద్ధి స్వేచ్ఛా సమానత్వం సౌభ్రాతృత్వం సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులుగా బహుజన లెఫ్ట్ మహిళా సంఘం జిల్లా నాయకురాలు తూర్పు విమల, ముఖ్య అతిథిగా డాక్టర్ ప్రతిమా రాజ్ , మహిళా టౌన్ ఎస్ఐ పుష్పా , గౌరవ అతిథిగా జి.ఆర్ సుజాత, తెలంగాణ ఫ్యామిలీ మహిళా కోఆర్డినేటర్, సదరన్ హోం సూపరింటెండెంట్ జ్యోత్స్న, ఎన్జీవో నాయకులు రాజయ్య, నాయకులు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సమగ్ర అభివృద్దే దేశాభివృద్ధికి మూలం.










## టియు వైస్ ఛాన్సలర్ టి. యాదగిరిరావు.

## తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, మార్చి 6:**

మహిళల సమగ్ర అభివృద్దే దేశాభివృద్ధికి మూలం అని టియు వైస్ ఛాన్సలర్ టి. యాదగిరిరావు అన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఉమెన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ భ్రమరాంబిక అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వైస్ ఛాన్సలర్ ఆచార్య టి. యాదగిరిరావు మాట్లాడుతూ, ఆధునిక సమాజంలో మహిళలు ప్రవేశించని రంగం లేదని, ఇటీవలి కాలంలో ప్రభుత్వం అన్ని రంగాలలో మహిళలను అగ్ర భాగాన నిలిపెందుకు తీవ్రమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ వుమెన్ డెవలప్మెంట్ ప్రోగ్రాంతో మహిళల ఆరోగ్యం, సంక్షేమం, సామాజిక భద్రత పెరిగిందన్నారు. మహిళల సమగ్రాభివృద్ధి తోనే విక్షిత్ భారత్ లక్ష్యం నెరవేరుతుందన్నారు. భారతదేశంలో రాష్ట్రపతి పదవి మొదలుకొని ముఖ్యమంత్రుల వరకు రాజకీయాలలో దూసుకుపోతున్నారని పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగం తో పాటు పరిపాలన రంగంలో ప్రపంచం గుర్తించే విధంగా కొనసాగడం దేశానికే గర్వకారణం అన్నారు.
మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యత తో అంతర్జాతీయంగా భారతదేశ తల ఎత్తుకొని నిలబడ్డదని గుర్తు చేశారు.
అతిథిగా హాజరైన ఆచార్య యం. యాదగిరి మాట్లాడుతూ, స్త్రీ, పురుషుల సంపూర్ణ సహకారంతోనే దేశం ముందుకు పోతుందని పేర్కొన్నారు.
ప్రధాన వక్తగా విచ్చేసిన నిజామాబాదు జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ జడ్జ్ పద్మావతి గారు మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాలలో స్త్రీలు దూసుకుపోవాలన్నారు. అందుకు స్త్రీలకు అన్నిరకాల విద్యల పట్ల అవగాహన ఉండాలన్నారు. ఇటీవల అత్యధికమైన మహిళలు సైబర్ క్రైమ్ లో మోసపోతున్నారని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అకుంఠిత దీక్షతో స్త్రీలు సాధించిన లక్ష్యాలు దేశాన్ని ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా ముందుకు తీసుకు వెళుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల, ఆచార్య విద్యావర్ధిని, ఆచార్య అరుణ,ఆచార్య లావణ్య, ఆచార్య ఆరతి, ఆచార్య అపర్ణ, డాక్టర్ శిరీష బోయపాటి, డాక్టర్ నందిని డాక్టర్ నీలిమ, డాక్టర్ శాంతాబాయి, డాక్టర్ కిరణ్ మయి, డాక్టర్ ప్రసన్న రాణి, డాక్టర్ స్రవంతి తదితరులు పాల్గొని సీనియర్ జడ్జ్ పద్మావతిని ఘనంగా సన్మానించారు.



# బీమా పాలసీలపై జిఎస్టీ దందా !

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలిదశ ముగిసింది. మలిదశ సమావేశాలు మార్చి పదినుంచి పక్షం రోజులు జరుగనున్నాయి. ఇవే అత్యంత కీలకమైన రోజులు. విపక్షానికి ఇది నిజంగా పరీక్షాకాలం. వారు అనేకానేక సమస్యలను లేవనెత్తడానికి అవకాశం కొనితెచ్చుకోవాలి. గొడవలతో బాయ్‌కాట్లతో సమస్యలు పరిష్కారం కావు. ఇందులో అత్యంత ప్రధానమైనది జిఎస్టీ అని గుర్తించాలి. జిఎస్టీతో పేద, మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొంటున్న బాదుళ్లను చర్చించాలి. ఎందుకంటే అధికార పార్టీ కాబూలీవాలాల లాగా వసూళ్లకు తెగిస్తోంది. పదేళ్లుగా పోరాటం చేస్తే..ఆదాయపు పన్నును 12 లక్షలకు చేర్చినా అందులోనూ మెలికలే పెట్టారు. మధ్యతరగతి ప్రపజలపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఆర్థిక అంశాలపై పార్లమెంట్‌లో చర్చించడం లేదు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కూడా కేవలం రాజకీయ ప్రయోజనాలు ఆశించి మాత్రమే తమ వాదనలు చేస్తోంది. బిజెపి ఎంపిలు కూడా ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టి పెట్టుకోవడం లేదు. కుక్కిన పేనుల్లా మోడీ ముందు మోకరిల్లుతున్నారు. ఆహా మోడీ..ఓహో మోడీ అంటూ భజనలు చేయడానికే సమయం కేటాయిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎక్కడా చర్చ చేయడం లేదు. ఎవరైనా చర్చించినా దానిని పట్టించుకోవడం లేదు. అంతెందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎదురుదాడితో విపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. జిఎస్టీపై గత పార్లమెంట్ సమావేశాల్లో ఆమె చేసిన ఎదురుదాడి ప్రసంగమే ఇందుకు నిదర్శనం. జీవిత, ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంలపై కేంద్ర ప్రభుత్వ 18 శాతం జిఎస్‌టి విధించడం అత్యంత దుర్మార్గం. ఆపద వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం ఆ కష్టాన్ని సైతం ఖజానాను నింపుకోవడానికి మార్గంగా చూడటం అమానుషం! సొంత పార్టీ నుండే వ్యతిరేకత వ్యక్తమవుతున్నా, సీనియర్ నేతలే ఈ నిర్ణయాన్ని తప్పు పడుతున్నా మోడీ ప్రభుత్వం మాత్రం కష్టకాలంలోనూ ప్రజల మూలుగులను పీల్చి పిప్పి చేయాలనే భావిస్తోంది. అందుకే ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని టాక్స్ టెర్రరిజంగా అభివర్ణిస్తున్నాయి. జిఎస్‌టిలో వివిధ వస్తువులు, సేవలపై సున్నా నుండి గరిష్టంగా 28 శాతం వరకు పన్నులు విధించవచ్చు. ఈ పట్టికలో చివరి నుండి రెండవ స్థానంలో ఉన్న 18 శాతం జిఎస్‌టిని బీమాపై పాలసీలపై విధిస్తున్న కేంద్రం బంగారం పై మూడు శాతం, వజ్రాలపై 0.25 శాతం మాత్రమే పన్ను వసూలు చేస్తుండటం గమనార్హం. కొన్ని సంవత్సరాలుగా బీమా కంపెనీలు రకరకాల కారణాలు చెబుతూ ప్రీమియం మొత్తాలను ఇష్టా రాజ్యంగా పెంచుతున్నాయి. ఈ పెంపును నియంత్రించే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేయలేదు. రెండు సంవత్సరాల క్రితం 22 సంవత్సరాలున్న ఒక వ్యక్తి ఐదు లక్షల రూపాయల బీమా మొత్తానికి పది వేల రూపాయలు ప్రీమియంగా చెల్లించే పరిస్థితి ఉంటే, గతేడాది ఆ ప్రీమియం 15 వేల రూపాయలకు చేరింది. ఇదే తలకు మించిన భారంగా మారుతుండటంతో అనేక మంది తమ పాలసీలను రద్దు చేసుకుం టున్నారు. ఇప్పుడు 18 శాతం జిఎస్‌టి విధించడంతో కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా దీనిని లేవెనెత్తినా..ఆయనను ఈగలాగా తీసిపారేశారు. ఆయన సూచనలకు విలువనివ్వలేదు. దీంతో పాలసీలపై పడే భారం మరింత పెరుగుతుం దన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడం ఎలా ఉన్నప్పటికీ రోగగ్రస్థ దేశంగా మారే ప్రమాదం ఉంది. ఆరోగ్య పాలసీలను పక్కన పెట్టి ప్రభుత్వం ఇచ్చే ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆరోగ్యశ్రీలపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇది కాస్తా కార్పోరేట్ ఆస్పత్రులను ప్రోత్సహించేలా మారుతోంది. నయా ఉదారవాద విధానాలు
అమలు చేస్తున్న పాలక వర్గాలు ఒక వ్యూహం ప్రకారం దేశ వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేశాయి. వైద్య సేవల కోసం ప్రైవేటు రంగంపై ఆధారపడక తప్పని స్థితిని సామాన్యులకు కల్పించాయి. ప్రైవేటు రంగానికి లాభాల లెక్కలే కీలకం కావడంతో వైద్యం సాధారణ ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. ప్రభుత్వ వైద్య రంగాన్ని తిరిగి పట్టాలెక్కిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటలు చెబుతున్నప్పటికీ ఆచరణలో అవి అమలుకు నోచుకోవడం లేదు. ఈ పరిస్థితే వైద్య రంగంలో బీమా ఆవశ్యకతను పెంచాయి. గతేడాది ప్రారంభంలో దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో లండన్ స్కూల్ ఆఫ్ హైజిన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ సంస్థ టి.బి రోగులపై ఒక సర్వే నిర్వహించగా 30 నుండి 61 శాతం మంది ఆర్థిక సమస్యల కారణంగా పూర్తి స్థాయిలో చికిత్సను తీసుకోలేకపోయారని తేలింది. వీరికి ఆరోగ్య బీమా ఉండి ఉంటే పరిస్థితి మెరుగ్గా ఉండేదని ఆ సంస్థ పేర్కొంది. ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ పథకాలు అనేక రాష్ట్రాల్లో అమలవుతున్నప్పటికీ దేశ వ్యాప్తంగా 2021 గణాంకాల ప్రకారం 40 కోట్ల మంది ఎటువంటి ఆరోగ్య బీమా లేకుండా ఉన్నారు.

# ఎక్కడో పుట్టి... ఇక్కడే కలిసాము..

# చదువులమ్మ చెట్టు నీడలో...







"ఆర్కిడ్స్"లో ఎస్ఎస్ సి విద్యార్థులకు ఘనంగా ఫేర్ వెల్ పార్టీ .

ఆటపాటలతో అలరించిన విద్యార్థిని, విద్యార్థులు.

పాల్గొన్న పాఠశాల చైర్మన్ అండ్ ప్రిన్సిపాల్ సిహెచ్. గోవర్ధన్ రెడ్డి, ఆర్ కె గ్రూప్ సిఇఓ జైపాల్ రెడ్డి.








వేగుచుక్క న్యూస్, కామారెడ్డి

పట్టణంలో ని ఆర్కిడ్స్ హై స్కూల్ లో పదవ తరగతి 2024౽2025 విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న పాఠశాల చైర్మన్ అండ్ ప్రిన్సిపాల్ సిహెచ్. గోవర్ధన్ రెడ్డి, ఆర్ కె గ్రూప్ సిఇఓ జైపాల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, పూజ నిర్వహించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిహెచ్. గోవర్ధన్ రెడ్డి, జై పాల్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి, భవిష్యత్తులో గొప్ప స్థాయిలో నిలవాలని సూచించారు. హై స్కూల్ వరకు ఉన్న విద్యార్థుల స్నేహాలు ఎంతో మధుర మైనవని, జీవితంలో స్థిర స్థాయిలో నిలుస్తాయని అన్నారు. పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతో గల బంధం గుర్తు చేసుకొన్నారు. విద్యార్థులు మాట్లాడుతూ, ఉపాధ్యాయలతో , వారి యొక్క అనుభవాలను, పాఠశాలతో గల బంధంను గుర్తు చేసుకొని కళ్ళు చెమర్చారు. కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థుల నృత్యాలు చూపారులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సదాశివ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భూలక్ష్మి, అకడమిక్ ఇంచార్జ్ వసంత, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

